# ఫ్యూర్ ఫెలో



కాలేజి కుర్రాళ్లు సిటీబస్సుకోసం వెయిట్‌చేస్తూ విసుగెత్తిపోతున్నారు. ఒకరిమీద ఒకరు ఏవేవో జోకులు పేల్చుకుంటూండగా చెవులకు కుండలాలూ, చేతులకి సువర్ణ కంకణాలూ, మెడలో రుద్రాక్షమాలలతో పచ్చగా మెరిసిపోతూ అచ్చంగా బృహస్పతిలా వెళ్తున్న ఘనాపాఠీ ఒకరు కనిపించారు. ఆ కుర్రమూకలోంచి జగన్నాథం అనే బి.ఏ. చదూతోన్న కుర్రాడు "ఫ్రెండ్స్, చూడండి ఓ చిన్న గమ్మత్తు చేస్తాను" అన్నాడు.

అందరూ ఆసక్తిగా జగన్నాథాన్ని చూస్తున్నారు.

"నమస్కారం సార్! బావున్నారా?" అన్నాడు అతను ఎదురుగా వెళ్లి రెండు చేతులూ జోడిస్తూ.

"దీర్ఘాయుష్మాన్‌భవ! ఎవరు బాబూ నువ్వు?" అన్నారాయన.

"మీరూ...... మీదీ ఊరేకదా!"

"కాదు బాబూ. నేను కాకినాడనుండి వస్తుంట"

"అలా చెప్పండి. ఎక్కడో చూసినట్టుందే అనుకున్నా! కాకినాడలో మీరుంటున్నది ఎక్కడ?"

"జగన్నాథపురం బాబూ! నీకక్కడ తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారా?"

"జగన్నాథరంలోనే మా బాబాయి ఉన్నాడండీ. షిప్పులో పనిచేస్తున్నాడు. నేను సెలవు లకి అటు వచ్చినపుడు మా ఇంటిముందు నుండి మీరెళ్తూండటం రోజూ చూస్తుండేవాణ్ణి. మా బాబాయి మీ గురించి గొప్పగా చెప్తుంటూరు సార్!"

"మీ బాబాయెవరమ్మా!"

"ఊ....... అదేనండి. సూరావధానిగారని సామవేదంలో మంచి పండితులు"

ఆయనో క్షణం ఆలోచించి సామ వేదంలో నాకు తెలీని వారెవరబ్బా అనుకొని "మరి షిప్పులో పనిచేస్తున్నారంటున్నావూ?" అన్నారు.

"అదికాదు సార్! ఈ సూరావధానులు గారు మా తాతగారు షిప్పులో పనిచేసేది వారి అబ్బాయి"

"ఓ..... అలాగా" అంటూ ఆలోచిస్తోన్న అతని కళ్లకి దూరం నుండి ఇటే చూస్తూ సైగలు చేసుకుంటూ నవ్వుకుంటూన్న విద్యార్థులు కనిపించారు.

అంతే! శాస్త్రులుగారు పేగులు లెక్క బ్టేశారు.

"ఓహో! అలా చెవ్వవేం? సురావధానులు నీకు తాతగారన్నమాట! అదే ఇందాకట్నుంచీ ఆలోచిస్తున్నాను. ఒరి భడవా! అచ్చు గుద్దినట్లు ఆ కళ్ళూ.... ఆముక్కూ. ఆఁ ...... ఎదిగిపోయావనుకో. సరే! నిన్ను చూస్తే మీ తాతని చూసినట్టుందోయ్. ఇంతకీ ఏం చదూతున్నావ్?"

"బి.ఏ. సెకెండియరండీ!"

"అబ్బో.... బాగా చదూతున్నావా? మీ తాతంటే నాకు చచ్చేంతహడలు. ఆయన దగ్గర నోరువిప్పి వేదమ్ముక్క చదవటానికే భయం. నేనేకాదు నాలాంటి ఘనాపాఠీలెందరో కూడా అతని దగ్గరెందుకూ పనికిరారు. రా! అలా టిఫిన్ చేద్దాం" అన్నాడు.

"అబ్బే. వద్దులెండి" అన్నాడు జగన్నాథం.

"ఫర్వాలేదోయ్" దగ్గర్లో ఉన్న కాఫీ హోటల్లో దూరారిద్దరూ.

సర్వరొచ్చాడు "ఏంటి కావాలని?"

"ఏమున్నాయి?" శాస్త్రి ప్రశ్న.

దండకం వల్లించాడు సర్వరు.

'రెండు ప్లేట్లు పెరుగ్గారె. తర్వాత పెసరట్టు పట్రా.

జగన్నాథం గొప్ప హుషారుగా ఉన్నాడు. "గురుడు గొప్ప టోకరా తిన్నాడు" అనుకున్నాడు మనసులో. పెరుగ్గారె పెసరట్టు తెచ్చి సర్వరు పెట్టగానే రెండు బోర్నవిటాకి ఆర్డరిచ్చి శాస్త్రిగారు

"నాకు కాఫీ తాగే ఆలవాటులేదు" అన్నారు.

"నేనూ తాగనండి" అన్నాడు జగన్నాథం.

సర్వరు బిల్లు తెచ్చాడు ముప్ప య్యయిదు రూపాయలకు.

మొహమాటంకోసం జగన్నాథం "నేనిస్తా అలాగుంచండి" అన్నాడుగాని బిల్లు మాత్రం ముట్టుకోలేదు.

శాస్త్రిగారు మొలతడుముకొని "అయ్యో! ఎంత పనయిపోయిందీ. పర్సు చేత్తో పట్టుకొని ఇంట్లో మరిచిపోయాను. పోనీ బాబూ, నీ సంతోషమే కానీ" అన్నాడు. జగన్నాథం జేబులోంచి కనిపిస్తోన్న ఏభయిరూపాయల నోటుని చాలా సేపట్నించి చూస్తోన్న శాస్త్రిగారు.

జగన్నాధం గొంతులో వెలక్కాయ పడింది. చేసేదిలేక ఆ బిల్లందుకుని కౌంటర్లో డబ్బులు చెల్లించాడు.

"బాబూ! ఓ మిఠాయి కిళ్ళీ తీసుకోమ్మా. వెధవది టిఫిన్‌చేస్తే కిళ్ళీ వేసుకోవాలని పిస్తుంది" అన్నారు బయట కిళ్ళీకొట్టు దగ్గర ఆగి.

'ఒరే ముసలోడా పడిపోయానురా! ఇంకా ఎందుకురా నన్ను బాదేస్తున్నావ్!' అని బయటకనలేక కొట్లో కిళ్ళీ తీసుకొని డబ్బు లిచ్చేశాడు.

"అయ్యా! బస్సు వచ్చేస్తుంది వస్తా సార్" అని హడావుడి పడుతోన్న జగన్నాథంతో....

"ఇంతకీ తాతగారికేం చెప్మంటావ్?" అని వెనక్కితిరిగి చూడకుండా పరుగుతీస్తోన్న జగన్నాథాన్ని చూసి 'ఫూల్‌ఫెలో నా వయసులో మూడోవంతు వయసులేని నువ్వునాతో జోకులేస్తావురా. ఇకపై జాగ్రత్తగా మెసలుకో!' అనుకున్నాడు మెల్లగా.